TGTEL/25/A4812

# వాయిస్ ఆఫ్ వందే భారత్

Voice of Vande Bharath

తెలుగు దినపత్రిక

సంపుటి : 01| సంచిక : 43 | పేజీలు : 04| వెల: రూ.3/- తెలంగాణ శనివారం | మే 23, 2026

## పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు



- ఇరాన్‌పై దాడులకు అమెరికా సన్నద్ధం!
- పశ్చిమ గగనతలాన్ని పూర్తిగా మూసివేసిన ఇరాన్ పౌర విమానయాన సంస్థ
- సెలవులు రద్దు చేసుకుని వాషింగ్టన్‌కు తిరిగొచ్చిన ట్రంప్, నిఘా విభాగాధిపతులు
- 24 గంటల్లో దౌత్య చర్చలు విఫలమైతే ఏ క్షణమైనా దాడులు ప్రారంభమయ్యే ఛాన్స్

**టెహ్రాన్/వాషింగ్టన్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** పశ్చిమాసియాలో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని అత్యంత ఉత్కంఠభరిత, ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరుదేశాల మధ్య శాంతి చర్చలు తుది దశకు చేరుకున్నాయని భావిస్తున్న తరుణంలోనే.. ఇరాన్‌పై మరోసారి భారీ ఎత్తున వైమానిక దాడులు చేసేందుకు అమెరికా సన్నద్ధమవుతున్నట్లు అంతర్జాతీయ మీడియాలో వార్తలు వెలువడటం గల్ఫ్ రీజియన్‌లో తీవ్ర కలకలం రేపుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో ఇరాన్ ప్రభుత్వం తీవ్ర అప్రమత్తమైంది. తమ దేశంలోని పశ్చిమ ప్రాంత గగనతలాన్ని పూర్తిగా మూసివేస్తున్నట్లు ఇరాన్ పౌర విమానయాన సంస్థ 'నోటమ్' జారీ చేసింది. ఈ నెల 25 వరకు అన్ని రకాల విమానాల రాకపోకలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. పశ్చిమాసియా సంక్షోభం తీవ్రరూపం దాల్చడంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ న్యూజెర్సీలో గడపాల్సిన తన వారాంతపు ప్లాన్స్‌ను అకస్మాత్తుగా రద్దు చేసుకుని రాజధాని వాషింగ్టన్‌కు చేరుకున్నారు. మెమోరియల్ డే వేడుకల్లో పాల్గొనాల్సిన అమెరికా రక్షణ, నిఘా సంస్థల సీనియర్ అధికారులు సైతం తమ సెలవులను రద్దు చేసుకుని అత్యవసరంగా విధుల్లో చేరారు. రాబోయే 24 గంటల్లో దౌత్యపరంగా ఎలాంటి పురోగతి లేని పక్షంలో.. టెహ్రాన్‌పై మళ్లీ దాడులు చేయడానికి అధ్యక్షుడు ట్రంప్ సుముఖంగా ఉన్నట్లు వైట్ హౌస్ వర్గాల సమాచారం. ఖతార్ ప్రతినిధుల విమానం తిరుగుపయనం: ఇరాన్ గగనతలాన్ని మూసివేసే సరిగ్గా అదే సమయంలో, శాంతి ఒప్పంద చర్చల కోసం టెహ్రాన్ వచ్చిన ఖతార్ ప్రభుత్వ వీఐపీ ప్రతినిధి బృందం విమానం ఇరాన్ సరిహద్దులను దాటి అత్యంత వేగంగా సురక్షిత ప్రాంతానికి వెళ్లినట్లు విమానయాన వర్గాలు గుర్తించాయి. ఒకవేళ అమెరికా గనుక యుద్ధాన్ని ప్రారంభిస్తే దీటుగా తిప్పికొట్టేందుకు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ (IRGC)తో పాటు ఇతర మిలిటరీ దళాలు పూర్తి సంసిద్ధతతో ఉన్నట్లు ఇరాన్ అధికారిక వార్తా సంస్థ 'తస్నిమ్' పేర్కొంది. అమెరికా ఆస్తులు, ప్రయోజనాలే లక్ష్యంగా ఇరాన్ మిలిటరీ ఎదురుదాడి ప్రణాళికలను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. మరోవైపు తెరవెనుక దౌత్యమార్గాల ద్వారా పాకిస్తాన్, ఖతార్ దేశాల మధ్యవర్తిత్వంతో శాంతి ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయని, అయితే అమెరికా పెడుతున్న కఠిన నిబంధనల వల్లే చర్చలు చివరి నిమిషంలో విఫలమయ్యే స్థితికి చేరుకున్నాయని అంతర్జాతీయ రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



2లో..

## యాదగిరిగుట్టలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన

- రూ.100 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- కంచి పీఠాధిపతితో కలిసి రూ.43.80 కోట్లతో నిర్మించనున్న వేదపాఠశాలకు భూమిపూజ
- స్వామివారిని దర్శించుకున్న ముఖ్యమంత్రి..
- మంత్రుల బృందం హాజరు

## రాష్ట్రంలో 'హీట్ వేవ్' హై అలర్ట్

- వడదెబ్బ మృతులకు రూ.4 లక్షల పరిహారం
- పరిస్థితిపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అత్యవసర సమీక్ష
- 18 జిల్లాలకు రెడ్ అలర్ట్
- 46 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు



2లో..

## బీఆర్ఎస్‌కు ఫ్యూచర్ లేదు.. ఫ్యూచర్ సిటీకి తిరుగులేదు

- హరీశ్‌రావుకు మంత్రి పొంగులేటి స్ట్రాంగ్ కౌంటర్
- బీఆర్ఎస్‌లో మీ ఫ్యూచరేంటో మీకే తెలియదు..
- అలాంటిది కొత్త నగరాన్ని ఆపుతారా?

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణ రాజకీయాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్ట్ తీవ్ర చర్చనీయాంశంగా మారింది. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే ఫ్యూచర్ సిటీని వంద శాతం రద్దు చేస్తామంటూ ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం సామాజిక మాధ్యమం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా హరీశ్‌రావుపై మంత్రి పొంగులేటి కౌంటర్ల వర్షం కురిపించారు. "హరీశ్‌రావు .. అసలు బీఆర్ఎస్ పార్టీలో మీ ఫ్యూచర్ ఏంటో మీకే తెలియదు.. అలాంటి మీరు రాష్ట్ర భవిష్యత్తు కోసం నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీని ఆపుతారా?" అంటూ ఎద్దేవా చేశారు. అమెరికా పర్యటనలో ఉండి ఇక్కడి ప్రాజెక్టును రద్దు చేస్తామని ప్రగల్భాలు పలుకుతున్న హరీశ్‌రావు.. ఫ్యూచర్ సిటీకి కేటాయించిన విలువైన ప్రభుత్వ భూములను తాకట్టు పెట్టడానికి అక్కడ ఎవరితోనైనా రహస్య ఒప్పందాలు చేసుకున్నారా? అని మంత్రి నిలదీశారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో హైదరాబాద్‌లో కనీసం ఒక్క కొత్త మెట్రో స్టేషన్ కూడా కట్టలేని నాయకులు..




నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ఏకంగా ఒక సరికొత్త ప్రపంచ స్థాయి నగరాన్నే నిర్మిస్తుంటే అసూయతో రగిలిపోతున్నారని మండిపడ్డారు.



2లో..

## ఇరాన్‌తో ఉద్రిక్తతల ఎఫెక్ట్

కుమారుడి పెళ్లికి దూరంగా ట్రంప్

వాయిస్ ఆఫ్ వందే భారత్
Voice of Vande Bharath

VOICE OF
VANDE BHARATH

శనివారం, మే 23, 2026

## బీఆర్ఎస్‌కు ఫ్యూచర్ లేదు..

- ఫ్యూచర్ సిటీకి తిరుగులేదు
- హరీశ్‌రావుకు మంత్రి పొంగులేటి స్ట్రాంగ్ కౌంటర్
- బీఆర్ఎస్‌లో మీ ఫ్యూచరేంటో మీకే తెలియదు..
- అలాంటిది కొత్త నగరాన్ని ఆపుతారా?

**(మొదటి పేజీ తర్వాత..)** గత పాలకులు కేసీఆర్ కుటుంబ సభ్యుల విలాసాల కోసం ఎక్కడ పడితే అక్కడ వందల ఎకరాల్లో ఫాంహౌస్‌లు కట్టుకున్నారని, కానీ తాము తెలంగాణ భవిష్యత్తు కోసం, దేశం గర్వించేలా 'ఫ్యూచర్ సిటీ'ని నిర్మిస్తున్నామని పొంగులేటి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నేతలు రాష్ట్ర అభివృద్ధిని నిరంతరం అడ్డుకుంటున్నారని మంత్రి ధ్వజమెత్తారు. మూసీ నది పునరుజ్జీవనాన్ని బాగుచేస్తామంటే అడ్డుపడుతున్నారు. లగచర్లలో పరిశ్రమలు పెట్టి స్థానిక యువతకు వేలాది ఉద్యోగాలిస్తామంటే కుట్రలు పన్నారు. ఇప్పుడు ఏకంగా రాష్ట్ర ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చే ఫ్యూచర్ సిటీని ఆపుతామంటూ పగటి కలలు కంటున్నారు. మళ్లీ అధికారంలోకి వస్తామంటూ భ్రమల్లో బతుకుతున్న హరీశ్‌రావుకు సొంత పార్టీలోనే రక్షణ లేదని పొంగులేటి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "మీ పొలిటికల్ ఫ్యూచర్ ఖతం చేయాలని మీ మామ (కేసీఆర్), మీ బామ్మర్ది (కేటీఆర్) లోపల కుట్రలు చేస్తున్నారు. కాబట్టి ఫ్యూచర్ లేని బీఆర్ఎస్ పార్టీలో ఉండి సమయం వృధా చేసుకోకుండా.. ముందు అక్కడి నుంచి బయటపడి మీ పొలిటికల్ ఫ్యూచర్ కాపాడుకోండి" అని హరీశ్‌రావుకు సూచించారు. ప్రజల ఆశీస్సులతో వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీయే ఘన విజయం సాధించి మళ్లీ అధికారంలోకి వస్తుందని, అంతిమంగా "బీఆర్ఎస్‌కు ఫ్యూచర్ లేదు.. ఫ్యూచర్ సిటీకి తిరుగులేదు" అని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తన ప్రకటనను ముగించారు.

## ఇరాన్‌తో ఉద్రిక్తతల ఎఫెక్ట్

### కుమారుడి పెళ్లికి దూరంగా ట్రంప్



**వాషింగ్టన్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** పశ్చిమాసియాలో ఇరాన్‌తో నెలకొన్న తీవ్ర అంతర్జాతీయ ఉద్రిక్తతల ప్రభావం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుటుంబంపై పడింది. ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల నేపథ్యంలో త్వరలో జరగనున్న తన పెద్ద కుమారుడు డొనాల్డ్ ట్రంప్ జూనియర్ వివాహ వేడుకకు తాను హాజరుకాకపోవచ్చని అధ్యక్షుడు ట్రంప్ స్వయంగా ప్రకటించారు. దేశ భద్రత, అంతర్జాతీయ పరిణామాల దృష్ట్యా తాను వాషింగ్టన్‌లోని వైట్ హౌస్‌లోనే ఉండటం ఎంతో ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు. ఓవల్ ఆఫీస్ వేదికగా విలేఖరులతో మాట్లాడిన ట్రంప్.. తనదైన శైలిలో ఈ వ్యవహారంపై చమత్కరించారు. "ఈ వివాహ వేడుకకు నేను హాజరైనా, లేదా హాజరుకాకపోయినా 'ఫేక్ న్యూస్ మీడియా' తప్పుడు వార్తలతో నా ప్రాణాలు తీస్తుంది (తీవ్రంగా విమర్శిస్తుంది). వివాహానికి వెళ్లేందుకు నేను ప్రయత్నిస్తాను. కానీ ప్రస్తుతం ఇరాన్ వ్యవహారాలు, ఇతర కీలక దేశీయుల బాధ్యతలు ఉన్నాయి. అందువల్ల ఈ సమయంలో వెళ్లడం సరైన సమయం కాదు" అని ట్రంప్ పేర్కొన్నారు. నిజానికి ఈ వివాహాన్ని వైట్ హౌస్‌లో ఘనంగా జరపాలని భావించినప్పటికీ, ఇరాన్ యుద్ధ వాతావరణం, ఇతర రాజకీయ పరిణామాల వల్ల ఆ ప్లాన్ రద్దు చేసుకున్నారు. కేవలం కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులతో కలిపి 50 మంది లోపు అతిథుల మధ్య ఈ వివాహాన్ని బహమాస్‌లోని ఒక ప్రైవేట్ దీవిలో నిర్వహించనున్నారు. అధ్యక్షుడు ట్రంప్ పెద్ద కుమారుడైన 48 ఏళ్ల డొనాల్డ్ ట్రంప్ జూనియర్.. ఈ వారాంతంలో ప్రముఖ మోడల్, సామాజికవేత్త అయిన బెట్టినా ఆండర్సన్ (39)ను వివాహం చేసుకోనున్నారు. వీరిద్దరికీ గత ఏడాది నిశ్చితార్థం జరిగింది. ట్రంప్ జూనియర్‌కు గతంలో (2005లో) వెనెసాతో వివాహం జరిగింది. వీరికి ఐదుగురు సంతానం ఉన్నారు. అయితే మనస్పర్థల కారణంగా 13 ఏళ్ల వైవాహిక బంధం తర్వాత 2018లో వీరు విడాకులు తీసుకున్నారు. ఆ తర్వాత 2020లో ఫాక్స్ న్యూస్ మాజీ హోస్ట్ కింబర్లీతో ట్రంప్ జూనియర్‌కు నిశ్చితార్థం జరగ్గా.. కొన్ని కారణాల వల్ల అది రద్దయింది (ప్రస్తుతం ఆమె గ్రీస్ దేశానికి అమెరికా రాయబారిగా ఉన్నారు). అనంతరం పామ్ బీచ్ సామాజికవేత్త అయిన బెట్టినా ఆండర్సన్‌తో ప్రేమలో పడిన ట్రంప్ జూనియర్.. ఈ వారాంతంలో ఆమెతో రెండోసారి పెళ్లి పీటలు ఎక్కబోతున్నారు. అయితే దేశ రక్షణ బాధ్యతల రీత్యా తండ్రి, దేశ అధ్యక్షుడు అయిన డొనాల్డ్ ట్రంప్ ఈ వేడుకకు రాలేకపోతుండటం అంతర్జాతీయ మీడియాలో చర్చనీయాంశంగా మారింది.

# యాదగిరిగుట్టలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన

- రూ.100 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- కంచి పీఠాధిపతితో కలిసి రూ.43.80 కోట్లతో నిర్మించనున్న వేదపాఠశాలకు భూమిపూజ
- స్వామివారిని దర్శించుకున్న ముఖ్యమంత్రి..
- మంత్రుల బృందం హాజరు



**యాదగిరిగుట్ట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో శనివారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పర్యటించారు. క్షేత్ర పరిధిలో రూ.100 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు ప్రతిష్టాత్మక అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఉదయం ప్రత్యేక హెలికాప్టర్‌లో పెద్దగుట్టపైకి చేరుకున్న సీఎం రేవంత్‌రెడ్డికి ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఘన స్వాగతం పలికారు. అనంతరం ముఖ్యమంత్రి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాదగిరిగుట్ట పవిత్ర పుణ్యక్షేత్రంలో సంప్రదాయ వేదపాఠశాల భవన నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి సమక్షంలో ఈ భూమిపూజ క్రతువు అత్యంత వైభవంగా జరిగింది. పెద్దగుట్ట ఆలయ నగరి లేఅవుట్ వద్ద 15 ఎకరాల విస్తీర్ణంలో రూ.43.80 కోట్లతో ఈ వేదపాఠశాల భవనాన్ని నిర్మించనున్నారు. రాబోయే రెండేళ్లలో ఈ నిర్మాణాన్ని పూర్తి చేసి, తరగతులను అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. వేదపాఠశాలతో పాటు భక్తుల సౌకర్యార్థం కొండపై రూ.100 కోట్లతో చేపట్టే పలు నిర్మాణ పనులకు సీఎం రేవంత్‌రెడ్డి శిలాఫలకాలను ఆవిష్కరించారు. అభివృద్ధి పనులు కేటాయించిన నిధులు సంప్రదాయ వేదపాఠశాల భవన నిర్మాణం రూ . 43.80 కోట్లు, డార్మిటరీ హాల్స్, దీక్షాపరుల సదన్ నిర్మాణం రూ.43.12 కోట్లు, కొండపై స్వామివారి నిత్య కల్యాణ మండపం రూ.9.87 కోట్లు, వైకుంఠ ద్వారం నుండి కొండపైకి వెళ్లే మెట్ల మార్గంపై కప్పురూ.1.41 కోట్లు, రథశాల వైపు మాడవీధులకు మెట్ల నిర్మాణం రూ. 1.35 కోట్లు కాగా ఉన్నాయి. ఈ ఉన్నతస్థాయి పర్యటనలో ముఖ్యమంత్రితో పాటు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రోడ్లు–భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఎంపీ వేం నరేందర్ రెడ్డి తదితరులు యాదాద్రికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ముఖ్యమంత్రికి, మంత్రులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, తీర్థప్రసాదాలు అందజేశారు.





# రాష్ట్రంలో 'హీట్ వేవ్' హై అలర్ట్

- వడదెబ్బ మృతులకు రూ.4 లక్షల పరిహారం
- పరిస్థితిపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అత్యవసర సమీక్ష
- 18 జిల్లాలకు రెడ్ అలర్ట్
- 46 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణ వ్యాప్తంగా భానుడి భగభగలు తీవ్రరూపం దాల్చడంతో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర ఉష్ణోగ్రతలపై హై అలర్ట్ ప్రకటించింది. వడగాల్పుల తీవ్రత, తాజా పరిస్థితిపై శనివారం సచివాలయంలో రెవెన్యూ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో వడగాల్పుల కారణంగా 7 జిల్లాల్లో 16 మంది మృతి చెందినట్లు అధికారికంగా గుర్తించామని తెలిపారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందజేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. రాబోయే మూడు రోజులు హీట్ వేవ్ మరింత తీవ్రంగా ఉండనుందని, ఒక్క ప్రాణం కూడా కోల్పోకుండా జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండి రక్షణ చర్యలు చేపట్టాలని మంత్రి మార్గనిర్దేశం చేశారు.18 జిల్లాల్లో 46 డిగ్రీలు దాటిన ఎండలురాష్ట్రంలోని 18కి పైగా జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 46 డిగ్రీల సెల్సియస్‌ను దాటడంతో వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ముఖ్యంగా ఉత్తర, తూర్పు జిల్లాలు తీవ్ర వడగాడ్పుల ప్రభావానికి గురవుతున్నాయి. రాజధాని హైదరాబాద్‌లోనూ పారాలు 43 డిగ్రీలకు పైగా నమోదవుతున్నాయి. కాగా, రాష్ట్రవ్యాప్తంగా వడదెబ్బ ప్రభావంతో ఇప్పటివరకు సుమారు 34 మంది ప్రాణాలు కోల్పోయినట్లు నివేదికలు అందుతుండటం ఆందోళన కలిగిస్తోంది. వడదెబ్బ ప్రమాదాలు – తీసుకోవాల్సిన జాగ్రత్తలువేసవి తీవ్రత దృష్ట్యా ప్రజలు ప్రాణాపాయం నుండి కాపాడుకునేందుకు వైద్య ఆరోగ్య శాఖ, ప్రభుత్వం ముఖ్యమైన మార్గదర్శకాలు జారీ చేసింది. ఉదయం 11 నుండి సాయంత్రం 4 గంటల వరకు బయటకు వెళ్లకూడదు. గాలిలో తేమ పెరిగి ఎక్కువగా నీరసించిపోయినప్పుడు ఓఆర్ఎస్, కొబ్బరి నీళ్లు, ఉప్పు కలిపిన నిమ్మరసం తాగాలి. 'హీట్ స్ట్రోక్' వల్ల మెదడు పనితీరు దెబ్బతినడం జరుగుతంది. కాబట్టి ముదురు రంగు దుస్తులు కాకుండా, తేలికపాటి లేత రంగు కాటన్ బట్టలు ధరించాలి. నిర్లక్ష్యం చేస్తే కిడ్నీ, గుండె సమస్యలు వచ్చి కోమాలోకి వెళ్లే ప్రమాదం ఉంటుంది. దోసకాయలు, పుచ్చకాయలు, దానిమ్మ, బత్తాయి లాంటి పండ్లు తీసుకోవాలి. వ్యవసాయ, భవన నిర్మాణ కార్మికులు మధ్యాహ్న సమయాల్లో పనులకు దూరంగా ఉంటూ ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టాలి. వృద్ధులు, గర్భిణులు, చిన్నారులు మరింత అప్రమత్తంగా ఉండాలి. శరీరంలోని నీటి శాతాన్ని తగ్గించే ఆల్కహాల్ వంటి వాటికి ఎండాకాలంలో దూరంగా ఉండటం అత్యంత శ్రేయస్కరం.వడదెబ్బ లక్షణాలు కనిపించిన వెంటనే బాధితులకు ఆయా ఆసుపత్రుల్లో అత్యవసర ఉచిత చికిత్స అందించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు.



# నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే ప్రభుత్వ లక్ష్యం

- విప్ ఆది శ్రీనివాస్
- సిరిసిల్లలో 30 కంపెనీలతో మెగా జాబ్ మేళా
- రాష్ట్రంలో ఇప్పటివరకు 70 వేల ఉద్యోగాలు కల్పించాం
- ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రత్యేక నిరుద్యోగ సదస్సు



**రాజన్న సిరిసిల్ల, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాష్ట్రంలోని నిరుద్యోగ యువతీ యువకులకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలోని 'శే కన్వెన్షన్ హాల్' లో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ ఉపాధి మేళాలో దేశ, విదేశాలకు చెందిన సుమారు 30 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా, గతంలో కరీంనగర్‌లో నిర్వహించిన జాబ్ మేళాలో వివిధ కంపెనీలకు ఎంపికైన రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన అభ్యర్థులకు విప్ ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు. అనంతరం ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం రాష్ట్ర ప్రజల సమస్యల త్వరితగతిన పరిష్కారానికి 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తోందని తెలిపారు. ఇందులో భాగంగానే గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో నిరంతరం సమావేశాలు నిర్వహిస్తూ ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలోనే తెలుసుకుని పరిష్కరిస్తున్నామని చెప్పారు. యువతకు ఉపాధి కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని విప్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఇప్పటివరకు రాష్ట్రంలో రికార్డు స్థాయిలో సుమారు 70 వేల ఉద్యోగ నియామకాలు చేపట్టింది. రాష్ట్రంలో గ్రూప్-1, టీచర్ రిక్రూట్‌మెంట్ సహా పలు కీలక ప్రభుత్వ ఉద్యోగాల నియామక ప్రక్రియలు ముమ్మరంగా సాగుతున్నాయని, రాబోయే రోజుల్లో మరిన్ని నోటిఫికేషన్లు వస్తాయని భరోసా ఇచ్చారు. కేవలం ఉద్యోగాలనే నమ్ముకోకుండా యువత స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయాలని, సొంతంగా పరిశ్రమలు స్థాపించే వారికి ప్రభుత్వం తరఫున భారీ సబ్సిడీ రుణాలు అందిస్తామని హామీ ఇచ్చారు. మహిళా సంఘాల అభ్యున్నతి కోసం ప్రభుత్వం 'ఇందిరా మహిళా శక్తి' పథకం ద్వారా రూ.కోట్ల నిధులను రుణాల రూపంలో అందించి వారిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతోందని పేర్కొన్నారు. అర్హులైన యువతీ యువకులు ఈ మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకుని ప్రైవేట్ రంగంలో వస్తున్న అద్భుతమైన అవకాశాలను చేజిక్కించుకోవాలని ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు. జిల్లా అధికారులు, మున్సిపల్ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, వేలాది మంది నిరుద్యోగ అభ్యర్థులు పాల్గొన్నారు.

# వార్డు ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యం

**కౌన్సిలర్ సిరిగిరి సంగీత-శ్రీకాంత్**

**మున్సిపల్ సిబ్బందితో వాటర్ ట్యాంక్ క్లీనింగ్**



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** పట్టణంలోని 10వ వార్డు ప్రజలకు ఎలాంటి కలుషితం లేని, స్వచ్ఛమైన తాగునీరు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ సిరిగిరి సంగీత-శ్రీకాంత్ స్పష్టం చేశారు. వేసవి తీవ్రత దృష్ట్యా వార్డు పరిధిలోని ప్రజలకు తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా శనివారం ఓల్డ్ అర్బన్ కాలనీలో ఉన్న ప్రధాన వాటర్ ట్యాంకును మున్సిపల్ సిబ్బందితో కలిసి వారు దగ్గరుండి క్లీనింగ్ చేయించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ సిరిగిరి సంగీత-శ్రీకాంత్ మాట్లాడుతూ.. ఎండకాలంలో నీటి ద్వారా వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున, ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని వాటర్ ట్యాంకును శుభ్రం చేయించినట్లు తెలిపారు. వార్డులోని ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు సక్రమంగా అందేలా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. 10వ వార్డు పరిధిలోని ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, వార్డు సమగ్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ఏకైక ఎజెండాగా తాము ముందుకు సాగుతున్నామని వారు స్పష్టం చేశారు. నీటి వృధాను అరికట్టాలని, ప్రజలంతా మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని ఈ సందర్భంగా వారు కోరారు.

# పెన్షనర్ల ఫేస్ అథెంటికేషన్ త్వరగా పూర్తి చేయాలి

- మున్సిపల్ కమిషనర్ మురళి
- అచ్చంపేట మున్సిపాలిటీలో వార్డుల వారీగా తనిఖీలు
- లబ్ధిదారుల ప్రక్రియను వంద శాతం పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** మున్సిపాలిటీ పరిధిలోని 'చేయూత' పెన్షన్ లబ్ధిదారుల ఫేస్ అథెంటికేషన్ (ముఖ గుర్తింపు ప్రక్రియ) కార్యక్రమాన్ని అత్యంత వేగంగా, పకడ్బందీగా పూర్తి చేయాలని అచ్చంపేట మున్సిపల్ కమిషనర్ మురళి అధికారులను ఆదేశించారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో జరుగుతున్న పెన్షనర్ల ఫేస్ అథెంటికేషన్ ప్రక్రియను ఆయన క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల నమోదు తీరును, సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం వార్డు అధికారులతో నిర్వహించిన సమీక్షలో కమిషనర్ మురళి మాట్లాడుతూ.. వార్డు ఆఫీసర్లందరూ ప్రతిరోజూ ఉదయం తమకు కేటాయించిన వార్డుల్లో విధిగా పర్యటించాలని సూచించారు. అర్హులైన ప్రతి చేయూత పెన్షనర్‌కు సంబంధించిన ఫేస్ అథెంటికేషన్ ప్రక్రియను వంద శాతం పూర్తి చేయాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందన్నారు. రకరకాల కారణాల వల్ల ఇంకా ఎవరైనా లబ్ధిదారులు పెండింగ్‌లో ఉంటే, వారి వివరాలను త్వరితగతిన సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కమిషనర్ ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పెన్షన్ల పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలంటే ఈ ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ క్షేత్రస్థాయి తనిఖీ కార్యక్రమంలో మున్సిపల్ వార్డు అధికారులు, కార్యాలయ సిబ్బంది, ఆయా వార్డులకు చెందిన పెన్షన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

# అన్నదాతల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

- ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే వంశీకృష్ణ
- 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' సదస్సు ముగింపు
- ఆరు వారాల పాటు రైతు వేదికల్లో అవగాహన
- తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించడమే లక్ష్యం



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాష్ట్రంలోని అన్నదాతల అభ్యున్నతే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ స్పష్టం చేశారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మండల పరిధిలోని పదర గ్రామంలో గల రైతు వేదికలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు – అన్నదాతల అవగాహన సదస్సు" ముగింపు కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వానాకాలం సాగుకు రైతులను ముందస్తుగా సమాయత్తం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ ప్రత్యేక కార్యాచరణకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో నేరుగా గ్రామాలకే వచ్చి రైతులకు ఆధునిక సాగు పద్ధతులపై ప్రత్యక్షంగా సూచనలు అందిస్తున్నారని చెప్పారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు ఎలా సాధించాలనే అంశంపై జిల్లాలోని అన్ని రైతు వేదికల్లో ఆరు వారాల పాటు ఈ అవగాహన కార్యక్రమాలను నిర్వహించేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందని పేర్కొన్నారు. ఈ సదస్సులో వ్యవసాయ అధికారులు, ప్రజాప్రతినిధులు రైతులకు పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. మితిమీరిన యూరియా వినియోగాన్ని తగ్గించి, భూసారాన్ని (నేల ఆరోగ్యాన్ని) కాపాడుకోవాలి. ఒకే రకమైన పంటలు వేయకుండా, మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా పంట మార్పిడి విధానాన్ని అవలంబించాలి. ఆధునిక పద్ధతుల ద్వారా సాగునీటిని పొదుపుగా వాడుకుంటూ పర్యావరణాన్ని పరిరక్షించాలి. గుర్తింపు పొందిన డీలర్ల వద్దే నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలి. రైతులు మార్కెట్లో విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా వాటికి సంబంధించిన 'క్యాష్ రశీదులను' పంట చేతికి వచ్చే వరకు భద్రపరచుకోవాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ సూచించారు. నకిలీ విత్తనాల వల్ల నష్టం వాటిల్లితే చట్టపరమైన చర్యలకు ఈ రశీదులు ఉపయోగపడతాయన్నారు. వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు, మండల వ్యవసాయ అధికారులు, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొని సదస్సును జయప్రదం చేశారు.

## కోనేటి కృష్ణ కుటుంబానికి చల్లా పరామర్శ

**దామెర, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** హనుమకొండ జిల్లా దామెర మండలం దుర్గంపేట గ్రామానికి చెందిన కోనేటి కృష్ణ ఇటీవల మృతి చెందగా, పరకాల మాజీ శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి శనివారం వారి నివాసానికి వెళ్లారు. మృతుడి కుటుంబ సభ్యులను కలిసి ఆయన పరామర్శించారు. గృహానికి చేరుకున్న మాజీ ఎమ్మెల్యే తొలుత కోనేటి కృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం కృష్ణ మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కృష్ణ అకాల మరణం పట్ల చల్లా ధర్మారెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ పరామర్శ కార్యక్రమంలో దామెర మండల బీఆర్ఎస్ నాయకులు, ముఖ్య కార్యకర్తలు, యువజన విభాగం నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## బాధ్యతాయుతంగా పనిచేయాలి

### వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్




**హనుమకొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** పోలీస్ శాఖలో పదోన్నతులతో పాటు బాధ్యతలు కూడా అంతే స్థాయిలో పెరుగుతాయని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ సిటీ ఆర్మ్డ్ రిజర్వు విభాగంలో హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొందిన బి.రాజేందర్ ప్రసాద్, కె.రమణాచారి శనివారం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సీపీని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు సీపీకి మొక్కను అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పదోన్నతి పొందిన హెడ్ కానిస్టేబుళ్లకు సీపీ సన్‌ప్రీత్ సింగ్ తన చేతుల మీదుగా యూనిఫారంపై పదోన్నతి స్టార్స్ అలంకరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పదోన్నతి పొందిన అధికారులు మరింత ఉత్సాహంతో, బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. పై అధికారులు అప్పగించిన విధులను, పనులను ఎప్పటికప్పుడు సమర్థవంతంగా నిర్వర్తిస్తూ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.

## వడదెబ్బతో జేసీబీ ఆపరేటర్ మృతి



**కాటారం, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** భానుడి భగభగలకు జిల్లాలో ఒక ప్రాణం బలైంది. రోజురోజుకూ ముదురుతున్న ఎండ తీవ్రతకు, వడదెబ్బ తగిలి తీవ్ర అస్వస్థతకు గురైన ఓ జేసీబీ ఆపరేటర్ మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన బినోద్ అనే వ్యక్తి గత కొంతకాలంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం గంగారం ఎక్స్ రోడ్డులోని 'బొమ్మ బ్రదర్స్' వద్ద జేసీబీ ఆపరేటర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం మల్హర్ మండలం రుద్రారం గ్రామ సమీపంలో జేసీబీతో పనులు చేస్తుండగా, ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో బినోద్ ఒక్కసారిగా తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. అస్వస్థతకు గురైన బినోద్‌ను గమనించిన తోటి సిబ్బంది వెంటనే చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో, కుటుంబ సభ్యుల సహకారంతో మెరుగైన వైద్యం కోసం మరియు స్వస్థలానికి తీసుకెళ్లేందుకు జార్ఖండ్‌కు తరలించారు. అయితే మార్గమధ్యంలో పరిస్థితి మరింత విషమించడంతో శుక్రవారం రాత్రి బినోద్ కన్నుమూశాడు. ఎప్పుడూ అందరితో సరదాగా, స్నేహపూర్వకంగా ఉండే బినోద్ అకాల మరణం చెందడంతో గంగారం ఎక్స్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. తోటి కార్మికులు, స్థానికులు ఆయన మృతికి సంతాపం ప్రకటించారు.

# అగ్నికి ఆహుతవుతున్న నల్లమల్ల



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** నాగర్‌కర్నూలు జిల్లాలోని దట్టమైన నల్లమల అడవులు దావాగ్నికి బుగ్గిపాలవుతున్నాయి. గత కొన్ని రోజులుగా నల్లమల అటవీ ప్రాంతంలో వరుసగా చెలరేగుతున్న మంటలు పచ్చని అడవిని దహించివేస్తున్నాయి. శనివారం సాయంత్రం అమ్రాబాద్ మండలం దోమలపెంట రేంజ్ పరిధిలోని జిలిగాయకుంట సమీపంలో, శ్రీశైలం – హైదరాబాద్ ప్రధాన రహదారి పక్కన భారీ ఎత్తున మంటలు చెలరేగాయి. ప్రసిద్ధ పర్యాటక ప్రాంతమైన ఫరాహాబాద్ వ్యూ పాయింట్‌కు కూతవేటు దూరంలోనే ఈ ప్రమాదం సంభవించి, మంటలు దట్టమైన అటవీ భాగానికి వేగంగా విస్తరిస్తున్నాయి. ఇంత పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడుతున్నా, దట్టమైన పొగలు కమ్ముకుంటున్నా అటవీ శాఖ అధికారులు మాత్రం తమకేమీ తెలియనట్టు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని స్థానికులు, ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల ఉదాసీనత, సకాలంలో స్పందించకపోవడం వల్లే వందలాది ఎకరాల అటవీ సంపద, విలువైన వనమూలికలు అగ్నికి ఆహుతి అవుతున్నాయని పర్యావరణ ప్రేమికులు ఆవేదన చెందుతున్నారు. అడవి తగలబడిపోతుండటంతో నల్లమలలోని అరుదైన వన్యప్రాణులు, పక్షులు ప్రాణభయంతో చెల్లాచెదురవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, మంటలను అదుపు చేయడానికి ఫైర్ ఫైటింగ్ సిబ్బందిని రంగంలోకి దింపాలని, నల్లమల అటవీ సంపదను కాపాడాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## పిడుగు పడి రెండు పశువులు మృతి



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భరత్;** మండలంలోని బుద్ద తాండలో విషాద ఘటన చోటుచేసుకుంది. గిరిజన రైతు మోత్యకు చెందిన రెండు పశువులు పిడుగు పడి మృతి చెందాయి. శనివారం సాయంత్రం కురిసిన అకాల వర్షం సమయంలో వ్యవసాయ పొలంలో చెట్టుకు కట్టేసి ఉన్న పశువులపై ఒక్కసారిగా పిడుగు పడటంతో అవి అక్కడికక్కడే మృతి చెందాయి. వ్యవసాయం కోసం ఇటీవలే రూ.1.10 లక్షల వ్యయంతో రెండు పశువులను కొనుగోలు చేసినట్లు రైతు తెలిపాడు. అప్పు చేసి పశువులను కొనుగోలు చేశానని, అనుకోకుండా పిడుగు పడి అవి మృతి చెందడంతో తీవ్ర ఆవేదనకు గురయ్యాడు. ఇక వ్యవసాయం ఎలా చేయాలో అర్థం కావడం లేదని కన్నీటి పర్యంతమయ్యాడు. ప్రభుత్వం స్పందించి తనను ఆదుకోవాలని, నష్టపరిహారం అందించి న్యాయం చేయాలని రైతు మోత్య వేడుకున్నాడు.

## భక్తుల మనోభావాలతో రాజకీయాలొద్దు

- విగ్రహాన్ని కూల్చిన వారిపై చర్యలేవి?
- కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి



**హనుమకొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** న్యూశాయంపేటలో శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయ పరిధిలోని హనుమాన్ విగ్రహ కూల్చివేత ఉదంతం హనుమకొండ జిల్లా రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. భక్తుల మనోభావాలతో కాంగ్రెస్ నాయకులు రాజకీయం చేయడం మానుకోవాలని కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి హెచ్చరించారు. శనివారం బాలసముద్రంలోని భారత రాష్ట్ర సమితి జిల్లా కార్యాలయంలో భక్తాంజనేయ స్వామి దేవాలయ కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ ముఖ్య నేతలతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మర్రి యాదవరెడ్డి మాట్లాడుతూ.. కుడా ప్రస్తుత చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి స్థానిక శాసనసభ్యుడు నాయిని రాజేందర్‌రెడ్డి స్క్రిప్ట్ ప్రకారమే ప్రెస్ మీట్ పెట్టి అవాకులు చవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. నాలుగు సార్లు ప్రజా తీర్పుతో ఎమ్మెల్యేగా గెలిచి, నిరంతరం ప్రజల్లో ఉండే దాస్యం వినయ్ భాస్కర్‌పై చిల్లర వ్యాఖ్యలు చేస్తే ఊరుకోబోమని స్పష్టం చేశారు. న్యూశాయంపేట ఆలయ భూమి రెవెన్యూ రికార్డుల ప్రకారం భక్తాంజనేయ స్వామి గుడిదేనని బీఆర్ఎస్ నేతలు స్పష్టం చేశారు. ఆంజనేయ స్వాములు, భక్తులు చందాలు వేసుకుని భక్తితో ప్రతిష్ఠించిన హనుమాన్ విగ్రహాన్ని అసలు ఎందుకు కూల్చాల్సి వచ్చిందో పాలకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. "న్యూశాయంపేట విగ్రహ ప్రతిష్ఠకు సహకరించాలని స్థానిక ప్రజలు, కమిటీ సభ్యులు పార్టీలకు అతీతంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని కలిసి సహాయం కోరారు. కానీ, ఆయనను కలిసిన కొద్ది రోజులకే హనుమాన్ విగ్రహాన్ని అత్యంత నృశంసంగా కూల్చివేయడం వెనుక ఏ ప్రజాప్రతినిధుల హస్తం ఉందో బయటపెట్టాలి. విగ్రహాన్ని ధ్వంసం చేసి హిందువుల, భక్తుల మనోభావాలను తీవ్రంగా గాయపరిచారు. ప్రశ్నించిన భక్తులపై పోలీస్ కేసులు పెట్టి, గుడి స్థలంలో కంచె వేయడం దుర్మార్గం" అని మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, స్థానిక నాయకుడు వేల్పుల వేణు ఆరోపించారు. ఈ విలేకరుల సమావేశంలో ఆలయ కమిటీ సభ్యుడు శ్యామ్ కుమార్, మాజీ కార్పొరేటర్లు దాస్యం విజయ్ భాస్కర్, సంకు నర్సింగరావు, ఇమ్మడి లోహిత రాజు, సోదా కిరణ్, బొంగు అశోక్ యాదవ్, ఉడతల సారంగపాణి, సీనియర్ నాయకులు తాళ్లపెల్లి జనార్ధన్ గౌడ్, పులి రజినీకాంత్, లీగల్ సెల్ బాధ్యులు వినోద్ కుమార్, న్యూశాయంపేట ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అకాల వర్షం..నీటి పాలైన రైతుల కష్టం



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భరత్ :** అచ్చంపేట పట్టణంలో శనివారం సాయంత్రం అకాల వర్షం రావడంతో మార్కెట్ యార్డ్ లో రైతుల కష్టం నీటిపాలైంది. ఎన్నో నెలల పాటు చెమటోడ్చి పండించిన ధాన్యాన్ని మార్కెట్ కు తీసుకొచ్చిన రైతులు, ఇప్పుడు కళ్లముందే ఆ ధాన్యం వర్షపు నీటిలో , వరద ప్రవాహంలో కొట్టుకుపోతుండటాన్ని చూసి తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ యార్డ్ అంతా నీటి మయంగా మారి చెరువును తలపిస్తోంది. ధాన్యం కుప్పల పై వర్షపు నీరు నిల్వ ఉండటంతో వేలాది బస్తాలు పూర్తిగా తడిసిపోయాయి.కొంత ధాన్యం నీటి ప్రవాహంలో కొట్టుకుపోతుండగా, రైతులు చేతులతోను, దోజర్లతో కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్న దృశ్యాలు హృదయ విదారకంగా మారాయి. సరైన షెడ్లు, టార్పాలిన్లు, నీటి పారుదల సదుపాయాలు లేకపోవడం పై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంట పండించడం ఒక యుద్ధమైతే.. దాన్ని కాపాడుకోవడం ఇప్పుడు మరొక యుద్ధంగా మారింది అంటూ రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే అప్పులు, పెట్టుబడుల భారంతో ఇబ్బందులు పడుతున్న రైతులకు ఈ అకాల వర్షం మరింత కష్టాలను తెచ్చిపెట్టింది. ప్రభుత్వం వెంటనే స్పందించి తడిసిన ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేయడంతో పాటు, నష్టపోయిన రైతులకు తక్షణ పరిహారం అందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.